ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G), రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

Registered No : APTEL/25/A1201

# గాయత్రి వార్తలు

జాతీయ తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను
గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్ : 73860 45673

PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ బుధవారం 08-04-2026 సంపుటి : 1 సంచిక :292 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-

## కాంగ్రెస్ ఎప్పటినుంచో పాక్ పాట పాడుతోంది: మోదీ



కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్‌తో సంబంధాలు నెరుపుతున్నట్టు దేశ ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. అస్సాంలో జరిగిన ఎలక్షన్ ర్యాలీలో పాల్గొన్న మోదీ దేశ భద్రతపై ప్రతిపక్షం వ్యవహరిస్తోన్న తీరుకు ఇప్పటికే పలుమార్లు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని విమర్శించారు. "సిందూర్ సమయంలో కూడా కాంగ్రెస్ పాక్ పాటే పాడింది. ఈ సంబంధం ఇప్పటిది కాదు.. ఎప్పటి నుంచో సాగుతోంది. ఇది జాతీయ భద్రతను తీవ్రంగా దెబ్బతీస్తోంది" అని మోదీ పేర్కొన్నారు. పేజి 2లో ▶

- జాతీయ భద్రత: దేశ భద్రత విషయంలో ప్రతిపక్షాల తీరు వల్ల గతంలో భారత్ భారీ మూల్యం చెల్లించుకుందని ఆయన పేర్కొన్నారు.
- సుదీర్ఘ సంబంధం: కాంగ్రెస్ పాక్ అనుకూల ధోరణి ఇప్పటిది కాదని, అది జాతీయ భద్రతను దెబ్బతీస్తోందని విమర్శించారు.
- ప్రెస్ కాన్ఫరెన్స్‌లు: కాంగ్రెస్ నేతలు పవన్ ఖేరా, గౌరవ్ గొగోయ్ నిర్వహించిన ప్రెస్ మీట్‌ల సమాచారం పాక్ సోషల్ మీడియా నుంచి సేకరించినట్లు ఆయన ఆరోపించారు.
- ఎన్నికలపై ప్రభావం: అస్సాం ఎన్నికలను ప్రభావితం చేసేందుకు పాకిస్థాన్ ఛానళ్లు 11 టాక్ షోలను నిర్వహించాయని, ప్రతి షో చివరలో కాంగ్రెస్ గెలవాలని కోరుకున్నారని ఆయన పేర్కొన్నారు.

## బంగ్లాదేశ్ సరిహద్దు జలాల్లోకి మొసళ్లు.. పాములు :



2లో..

## రూ.39,436 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 16వ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది.
- రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది.

ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా 1,11,278 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.
- అమరావతి క్వాంటం వ్యాలీలో 3 సంస్థల ఏర్పాటుకు ప్రోత్సాహక బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.
- ఏపీలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా చంద్రబాబు సూచించారు.



అమరావతి: సాగు వ్యర్థాల సద్వినియోగం కోసం యూనిట్ల ఏర్పాటుకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఆధునిక భద్రతా ప్రమాణాలతో పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాయలసీమను సౌరవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 325 గిగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రానున్న రోజుల్లో సౌరవిద్యుత్ ఉత్పత్తి మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని, సౌరవిద్యుత్ సామర్థ్యానికి అనుగుణంగా పెట్టుబడులు ఆకర్షించాలని సీఎం సూచించారు.

## బస్సుల్లో ఈ జాగ్రత్తలు పాటించండి..

### ఆర్టీఏ అధికారిని ప్రశంసించిన లోకేశ్



- టూవ్రెల్స్ బస్సుల్లో తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో.. ప్రయాణికులకు రవాణా శాఖ అధికారి ఒకరు అవగాహన కలిగించారు.
- కృష్ణా జిల్లా ఉయ్యూరులో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ సిద్ధిఖ్.. ట్రావెల్స్ బస్సును ఆపి ప్రయాణికులతో మాట్లాడారు.

2 లో

## పండ్ల మార్కెట్ భూముల మీద రేవంత్‌రెడ్డి కన్ను:



సీఎంపై ఆరోపణ: కోహెడ పండ్ల మార్కెట్ భూములపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కన్ను పడిందని, ఎక్కడ ఖరీదైన భూములున్నా వాటిని అమ్మేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు.

2 లో

## దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఇళ్లలో ఏసీబీ సోదాలు



## బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు ఊపిరితిత్తులు.. గ్రీన్‌ఛానెల్ ఏర్పాటు



హైదరాబాద్: ఓ వ్యక్తికి అత్యవసరంగా అమర్చేందుకు వైద్య బృందం బెంగళూరు నుంచి సికింద్రాబాద్‌కు ఊపిరితిత్తులు తీసుకొస్తున్నారు.

2 లో

## రుషికొండ భవనాల వినియోగంపై నివేదిక సిద్ధం

సచివాలయంలోని మంత్రి కందుల దుర్గేశ్ కార్యాలయంలో సబ్ కమిటీ ఐదోసారి భేటీ



విశాఖ రుషికొండ భవనాల వినియోగంపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తమ అధ్యయన తుది నివేదికను సిద్ధం చేసింది. . మంత్రులు పయ్యావుల కేశవ్, డోలా బాలవీరాంజనేయస్వామి వర్చువల్‌గా హాజరయ్యారు. గత నాలుగు భేటీల్లో తీసుకున్న నిర్ణయాలపై చర్చించిన మంత్రులు.. పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలపై తుది నివేదిక సిద్ధం చేశారు.రుషికొండ ప్యాలెస్‌ను ప్రజల సందర్శనకు అనుమతించడంతోపాటు

## వివాహేతర సంబంధం.. భార్యను హత్య చేసిన భర్త

వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందన్న ఆగ్రహంతో భార్యను భర్త హత్య చేశాడు.

2 లో



## 'సిమ్ స్వాపింగ్'తో జాగ్రత్త..

### ఈ మోసాల్ని గుర్తించడం ఎలా?



2 లో

# సంపాదకీయం

ఎవరికీ సబార్డినేట్‌ని కాదు
ాాదీచీ ,ాబఎశ్రీఅంష్ట్ర ఙ్షవ - మీుతీ 08 , 2026 । 01:56ాావీ

పశ్చాత్తాపం--ప్రాయశ్చిత్తం... ఈ రెండూ మనుషులకు ఎప్పుడో ఒకప్పుడు అనుభవంలోకి వస్తాయి. మనిషన్నాక ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక తప్పు చేయకుండా ఉండడు. అయితే, తప్పు చేస్తున్నామని గుర్తించి...

ఎవరికీ సబార్డినేట్‌ని కాదు

పశ్చాత్తాపం--ప్రాయశ్చిత్తం... ఈ రెండూ మనుషులకు ఎప్పుడో ఒకప్పుడు అనుభవంలోకి వస్తాయి. మనిషన్నాక ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక తప్పు చేయకుండా ఉండడు. అయితే, తప్పు చేస్తున్నామని గుర్తించి అటువంటి తప్పులను మళ్లీ చేయకుండా... పశ్చాత్తాపం చెంది ప్రాయశ్చిత్తం చేసుకొనే వాళ్లు మనీషిగా నిలుస్తారు. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఇద్దరు రష్యన్ మహిళలతో గతంలో అక్రమ సంబంధం నెరిపారు. ఇందుకు ఆయన తర్వాత పశ్చాత్తాపం చెందారు. తన సంపదలో సింహభాగాన్ని సేవా కార్యక్రమాలకు కేటాయించి ప్రాయశ్చిత్తం చేసుకుంటున్నారు కూడా! మన దేశంలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో తప్పులు చేసిన, చేస్తున్న రాజకీయ నాయకులు ఇందుకు భిన్నంగా బుకాయిస్తున్నారు. చేసిన తప్పు ఒప్పుకొని చెంపలేసుకోకుండా రాజకీయ ఎత్తుగడలతో రచ్చ సృష్టిస్తున్నారు. తిరుమలలో లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వాడటంతో ప్రారంభమైన తప్పులు ఎన్నెన్నో మలుపులు తిరుగుతున్నాయి. ఈ క్రమంలో లడ్డూనే కాదు-- మతాన్ని కూడా కల్తీ చేస్తున్నారు. తిరుమల లడ్డూకు కల్తీ నెయ్యి వాడటం సత్యం. ఈ తప్పునకు నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రత్యక్షంగా కారకుడు కాకపోవచ్చు. అయితే తన హయాంలో ఆ దేవదేవుడికి అపచారం జరిగినందుకు పశ్చాత్తాపం చెంది, సారీ చెప్పి ఉంటే వివాదం అంతటితో ముగిసేది. జగన్ అండ్ కో అలా చేయకుండా ఎదురుదాడికి దిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థనూ వివాదంలోకి లాగింది. తిరుమలకు నెయ్యి సరఫరా చేసిన సంస్థలలో ఒకటైన ఇందాపూర్ డెయిరీలో హెరిటేజ్ కూడా నెయ్యి ఉత్పత్తి చేసిందని ఆరోపించారు. దీంతో హెరిటేజ్ సంస్థ షేర్ల ధర క్షీణించిందని సంబరపడుతున్నారు. హెరిటేజ్ సంస్థ ప్రైవేట్ కంపెనీ. కాకపోతే అది పబ్లిక్ లిమిటెడ్. షేర్ల ధరలు క్షీణిస్తే ఆ కంపెనీ ప్రమోటర్లకంటే ఆ కంపెనీ షేర్లు కొనుగోలు చేసిన మదుపరులే ఎక్కువగా నష్టపోతారు. ఈ మాత్రం ఇంగితం కూడా లేకుండా హెరిటేజ్‌పై దాడిని ఉధృతం చేశారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడటానికీ హెరిటేజ్‌కూ ఏమి సంబంధం? కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ఆడుకున్నందుకు క్షమాపణలు చెప్పాల్సిందిపోయి ఒక ప్రైవేట్ కంపెనీపై దాడిని కేంద్రీకరించి పైశాచిక ఆనందం పొందారు. ఈ వ్యవహారంపై శాసన మండలిలో కూడా రచ్చ జరిగింది. ఈ సందర్భంగా మతం తెర మీదకు వచ్చింది. కల్తీ నెయ్యి వ్యవహారం కారణంగా హిందువుల మనోభావాలు దెబ్బతిన్నందున వారంతా జగన్‌రెడ్డికి వ్యతిరేకమవుతారన్న భావన వైసీపీ నాయకుల్లో ఏర్పడినట్టుగా ఉంది. అంతే, కొత్తగా మతం పుచ్చుకున్నవాడికి నామాలు ఎక్కువ అన్నట్టుగా జగన్‌రెడ్డితో సహా ఆ పార్టీ నాయకులు హిందూ మతంపై అంతకు ముందులేని ప్రేమ కనబరచటం మొదలుపెట్టారు. కడపలో పునరుద్ధరించిన దేవాలయాలలో జగన్‌రెడ్డి ప్రత్యేకంగా పూజలు చేయడం చూశాం. 2019 ఎన్నికలకు ముందు కూడా స్వరూపానంద స్వామి చొరవతో జగన్‌రెడ్డి గంగా నదిలో స్నానం ఆచరించారు.

నాలుగు తరాలుగా..

జగన్‌రెడ్డి కుటుంబం నాలుగు తరాలుగా క్రైస్తవ మతాన్ని ఆచరిస్తోంది. ఇది జగన్‌రెడ్డి ముత్తాత వెంకటరెడ్డితో మొదలైంది. తాత రాజారెడ్డి, తండ్రి రాజశేఖరరెడ్డి, ఇప్పుడు జగన్‌రెడ్డి కూడా అదే మతాన్ని ఆచరిస్తున్నారు. మతం అనేది వ్యక్తిగత స్వేచ్ఛ. ఎవరైనా ఏ మతాన్నయినా స్వీకరించి ఆచరించవచ్చు. జగన్‌రెడ్డి క్రైస్తవ మతాన్ని ఆచరిస్తుంటే ఆక్షేపించవలసింది ఏమీ లేదు. అయితే, ఇప్పుడు ఇది రాజకీయంతో ముడిపడి ఉన్నందున హిందూ మతమన్నా తనకు గౌరవం అని చాటి చెప్పుకోవడానికి ఆయన ప్రయత్నాలు మొదలు పెట్టారు. క్రైస్తవుడయినందునే జగన్‌రెడ్డి తన హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వాడినా పట్టించుకోలేదని కూటమి నాయకులు ప్రచారం చేయడం మొదలెట్టారు. ఈ ప్రచారం వల్ల హిందువులు తనకు దూరమవుతారన్న భయంతో జగన్మోహన్‌రెడ్డి గుళ్లూ గోపురాలు తిరగడం మొదలెట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో మత మార్పిడి చేసుకొని క్రైస్తవులైనవారు హిందూ దేవాలయాలకు వెళ్లరు. తీర్థప్రసాదాలు కూడా ముట్టరు. జగన్‌రెడ్డి రాజకీయాల్లో ఉన్నందున గుళ్లూ గోపురాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంతవరకు ఆయన క్రైస్తవ మతాన్ని ఆచరిస్తారని చాలా మందికి తెలియదు. ఆ మేరకు ఆయన జాగ్రత్తలు తీసుకున్నారు. జగన్‌రెడ్డి మాత్రం ఆ జాగ్రత్తలు తీసుకోలేకపోయారు. తను ఊరూరా నిర్మించుకున్న ప్యాలెస్‌లపై శిలువ గుర్తు వేయించుకున్నారు. అంతే కాదు, క్రైస్తవ మతం పుచ్చుకున్న ఇతరులు ఆయనకు ఓటు బ్యాంకుగా మారారు. ఈ నేపథ్యంలో కల్తీ నెయ్యి అంశం తెరమీదకు రావడం, దీని ఆధారంగా జగన్‌రెడ్డిని హిందూ వ్యతిరేకిగా ముద్రవేయడానికి కూటమి నాయకులు ప్రయత్నించడం జరుగుతోంది. దీంతో ఉలిక్కిపడిన వైసీపీ నాయకులు ఈ ప్రచారానికి విరుగుడుగా జగన్‌రెడ్డిని దేవాలయాలకు తిప్పడం మొదలెట్టారు. హెరిటేజ్ సంస్థను వివాదంలోకి లాగారు. ఈ క్రమంలో మతాన్ని కూడా కల్తీ చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు శాసనమండలిలో మాట్లాడుతూ జగన్‌రెడ్డితో పాటు శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు కూడా క్రైస్తవులే అని అన్నారు. దీంతో ఉలిక్కిపడిన చైర్మన్ మోషేన్ రాజు 'నేను క్రైస్తవుడిని కాదు, హిందువునే' అని చైర్మన్ స్థానంలో కూర్చొని మరీ ప్రకటించుకున్నారు. వాస్తవానికి ఆయన క్రైస్తవాన్ని ఆచరిస్తారు. చర్చిలకు మాత్రమే వెళ్లి ప్రార్థనలు చేస్తారు. ఆయన దేవాలయాలకు వెళ్లి పూజలు చేసిన దాఖలాలు లేవు. 'ఏసు ప్రభువు మాత్రమే నిజమైన దేవుడు' అని ఆయన స్వయంగా చెప్పిన మాటలు ప్రచారంలోకి వచ్చాయి. క్రైస్తవ మతాన్ని ఆచరించడం నేరం కానప్పుడు మోషేన్ రాజు తాను హిందువునని ఎందుకు చెప్పుకొన్నట్టు? ఇందుకు కారణం లేకపోలేదు. దళితులు తాము క్రైస్తవులమని ప్రకటించుకుంటే రిజర్వేషన్ల కోటాలో బీసీలుగా పరిగణించబడతారు. దళిత కోటాను కోల్పోతారు. ఈ కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో క్రైస్తవులుగా మారిన దళితులలో అత్యధికులు రికార్డుల ప్రకారం హిందువులుగానే కొనసాగుతున్నారు. మోషేన్ రాజు కూడా ఈ కారణంగానే తాను హిందువును అని సభా సాక్షిగా చెప్పుకొని ఉంటారు. మొత్తం మీద మతాన్ని కూడా కల్తీ చేశారు.

ఈ నేపథ్యంలోనే హిందువులు సంఘటితమైతే తమ రాజకీయ ప్రయోజనాలు దెబ్బతింటాయన్న భయంతో వైసీపీ నాయకులు ఇప్పుడు హిందూ జపం చేస్తున్నారు. కల్తీ నెయ్యి వ్యవహారం ఇప్పుడు కల్తీ మతం వరకూ వచ్చింది. కల్తీ నెయ్యి వ్యవహారం తెర మీదకు వచ్చినప్పుడే జరిగిన దానికి క్షమాపణలు చెప్పి ఉంటే వివాదం అంతటితో ముగిసి ఉండేది. అలా చేయకుండా ఎదురుదాడికి దిగడం వల్ల తమ మతాన్ని కూడా కప్పిపుచ్చుకోవాల్సిన పరిస్థితిని కొని తెచ్చుకున్నారు.

### గేట్స్‌ను విమర్శించే అర్హత ఉందా...

ఇంతకు ముందే చెప్పుకొన్నట్టుగా కల్తీ నెయ్యి వాడకానికి జగన్‌రెడ్డి ప్రత్యక్షంగా కారకుడు కాకపోయి ఉండొచ్చు. కాసులకోసం కక్కుర్తిపడిన ఎవరో ఆ పాతకానికి ఒడిగట్టారు. జరిగిన దానికి నైతిక బాధ్యత వహించి దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవలసిందిగా జగన్‌రెడ్డి కోరి ఉంటే హుందాగా ఉండేది. అలా చేయకపోగా మనసులో ఇష్టం లేకపోయినా గుళ్లూ గోపురాల చుట్టూ తిరగవలసి వస్తోంది. ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే మన రాజకీయ నాయకులకు దేవుడు, మతం కూడా రాజకీయాలకు ముడి సరుకుగా మారిపోయాయనిపిస్తోంది. రాజకీయ ప్రయోజనాల కోసం తాము విశ్వసించని మతాన్ని నమ్ముతున్నట్టు ప్రకటిస్తారు. ఇష్టం లేని దేవుడికి పూజలు చేస్తారు. మనసులో చిరాకుగా ఉన్నప్పటికీ నామాలు పెట్టుకుంటారు. గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చుకోవడం అంటే ఇదే. ఇప్పుడు చెప్పండి, బిల్‌గేట్స్‌ను నానా మాటలూ అన్నవారికి ఆయనను విమర్శించే నైతిక అర్హత ఉందా? కల్తీ నెయ్యి అంశం

# కాంగ్రెస్ ఎప్పటినుంచో పాక్ పాట పాడుతోంది: మోదీ

మొదటి పేజీ తరువాయి

**పాక్ 11 టాక్ షోలు**

"నిన్న పవన్ ఖేరా, గౌరవ్ గొగోయ్ దిల్లీలో, గువాహటిలో రెండు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించారు. అయితే ఆ కాన్ఫరెన్స్‌కి సంబంధించిన మొత్తం సమాచారాన్ని పాక్ సామాజిక మాధ్యమాల నుంచి తీసుకున్నట్టు గుర్తించాం. అస్సాం ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో పాకిస్థాన్ ఛానల్ 11 టాక్ షోలను నిర్వహించింది. ఇలా ఇంతకు ముందెప్పుడూ జరగలేదు. ప్రతి షోలోనూ చివరకు కాంగ్రెస్ గెలవాలని చెబుతూ ముగించారు. నిన్న జరిగిన కాన్ఫరెన్స్‌లో పాక్ జోక్యం స్పష్టంగా వెల్లడైంది" అని అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు.

**తప్పుడు ఆరోపణలపై సీఎం భార్య కేసు**

అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సతీమణి రిణికి భూయాన్ శర్మకు 3 దేశాల పాస్‌పోర్టులు ఉన్నాయని, దీంతోపాటు ఆమె ఆస్తులను ఆయన అఫిడవిట్‌లో వెల్లడించకుండా దాచిపెట్టారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. "సాక్ష్యం లేకుండా తప్పుడు ఆరోపణలు చేసినప్పుడు కేసు నమోదు చేయొచ్చు. ఎన్నికల సమయంలో ప్రజలను ప్రభావితం చేసేందుకే ఇలాంటి విమర్శలు చేశారు. దానికి శిక్ష అనుభవించక తప్పదు. నిన్న నా భార్య తనపై వచ్చిన ఆరోపణలపై కేసు పెట్టింది. పోలీసులు చట్టం ప్రకారం దీనిపై చర్యలు తీసుకుంటారనే భావిస్తున్నాను. అస్సాం పోలీసులు ఇంతకుముందే పాస్‌పోర్ట్‌ల విషయంలో దర్యాప్తు చేశారు. దుబాయి పాస్‌పోర్టు ఫేక్ అని తేలినట్టు దుబాయి అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. మిగతా దేశాల రిపోర్టులు మరో రెండ్రోజుల్లో రావొచ్చు" అని హిమంత బిశ్వ శర్మ వివరించారు.

# బంగ్లాదేశ్ సరిహద్దు జలాల్లోకి మొసళ్లు.. పాములు :

మొదటి పేజీ తరువాయి

సరిహద్దు వద్ద చొరబాటుదారులకు, నేర కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు బీఎస్ఎఫ్ సరికొత్త ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ సరిహద్దు లో కీలకమైన నదీ పరివాహక ప్రాంతాల్లోకి పాములు, మొసళ్లను వదలాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రతిపాదన ఎంతవరకు సాధ్యమో పరిశీలించాలని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ తన ప్రాంతీయ కేంద్రాలకు ప్రతిపాదనలు పంపిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

ఈ ప్రతిపాదనల వెనక కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదేశాలు ఉన్నట్లు తెలుస్తోంది. "ఈ ఆలోచన ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. దీని అమలులో అనేక సవాళ్లు ఉన్నాయి. పాములు, మొసళ్లను తొలుత సేకరించాలి. నదీతీర ప్రాంత ప్రజలపై వాటి ప్రభావం ఎలా ఉంటుందనేది అధ్యయనం చేయాలి" అని సంబంధిత అధికారిని ఉటంకిస్తూ మీడియా కథనాలు వెల్లడించాయి. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌తో భారత్‌కున్న సరిహద్దు వద్ద రక్షణపరంగా ప్రధాన బాధ్యత బీఎస్ఎఫ్‌దే. దేశ తూర్పు సరిహద్దు వెంబడి(బంగ్లాదేశ్ వైపు) స్మగ్లింగ్, చొరబాటు కార్యకలాపాలపై కేంద్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. వాటికి చెక్ పెట్టేందుకు పలు ఆలోచనలు చేస్తున్నప్పటికీ.. ఈ ప్రాంతానికి ఎప్పుడూ వరద ముప్పు పొంచి ఉంటుంది. దాంతో ఫెన్సింగ్ వేయడం క్లిష్టంగా మారింది. మరోవైపు అక్కడ జనసాంద్రతా అధికమే. ఫెన్సింగ్‌కు ప్రత్యామ్నాయంగా సరీసృపాలను ఉంచాలన్న ఆలోచన ఉన్నప్పటికీ.. సరిహద్దుకు ఇరువైపులా నివసించే ప్రజలకు అవి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. వరదల సమయంలో అవి జనావాసాలకు కొట్టుకొచ్చే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఈ అంశాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

# 'సిమ్ స్వాపింగ్'తో జాగ్రత్త..

సైబర్ మోసాల పై ఎప్పటికప్పుడు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న తెలంగాణ సైబర్ క్రైం అధికారులు.. తాజాగా పెరుగుతోన్న సిమ్ స్వాపింగ్ మోసాలపై అప్రమత్తం చేస్తున్నారు. ఈ మోసంలో సైబర్ కేటుగాళ్లు తాము చోరీ చేసిన వ్యక్తిగత సమాచారంతో బాధితుడి పేరుతో నకిలీ సిమ్ కార్డును అక్రమంగా పొంది బ్యాంకు ఖాతాలను లూటీ చేస్తున్నారని హెచ్చరించారు. సిమ్ యాక్టివేట్ అయిన తర్వాత ఓటీపీలు, బ్యాంక్ అలర్ట్‌లు, రహస్య సమాచారాన్ని పొంది దుర్వినియోగానికి పాల్పడతారని పేర్కొన్నారు. అందువల్ల ఈ తరహా మోసాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత, ఆర్థికపరమైన వివరాలను షేర్ చేసుకోవద్దని సూచిస్తున్నారు.

### ఈ మోసం ఎలా జరుగుతుంది?

పర్సనల్ డేటా చోరీ: సైబర్ నేరగాళ్లు ఫిషింగ్ కాల్స్, నకిలీ లింక్‌లు, డేటా లీక్‌లు, సోషల్ మీడియా ద్వారా వ్యక్తుల వివరాలను సేకరిస్తారు.

తాము నిజమైన యూజర్‌గా నటిస్తూ సంబంధిత మొబైల్ సేవా సంస్థలను సంప్రదించి సిమ్ రీప్లేస్‌మెంట్ కోసం అభ్యర్థిస్తారు.

సిమ్ డీయాక్టివేషన్: దీంతో బాధితుడి అసలు సిమ్ అకస్మాత్తుగా పనిచేయడం ఆగిపోతుంది.

డూప్లికేట్‌సిమ్ యాక్టివేషన్: ఇదే అదునుగా నేరస్థులు బాధితుడి నంబర్‌కు సంబంధించిన కొత్త సిమ్‌ని యాక్టివేట్ చేస్తాడు

బ్యాంకు ఖాతాల యాక్సెస్: వ్యక్తి కొత్త సిమ్‌కు వచ్చిన ఓటీపీలను ఉపయోగించి బ్యాంక్ పాస్‌వర్డ్‌లను రీసెట్ చేస్తారు. యూపీఐ/నెట్‌బ్యాంకింగ్ యాక్సెస్ పొంది డబ్బులు బదిలీ చేస్తారు.

హెచ్చరిక సంకేతాలివే..

అకస్మాత్తుగా మొబైల్ నెట్‌వర్క్ కోల్పోవడం

ఓటీపీలు లేదా బ్యాంకు అలర్ట్‌లు అందకపోవడం

అనధికారిక లావాదేవీలు

బ్యాంకు/ఈ-మెయిల్ ఖాతాలకు యాక్సెస్ పొందలేకపోవడం

ఏం చేయాలి?

సిగ్నల్ కోల్పోతే వెంటనే మీ టెలికాం ఆపరేటర్‌ని సంప్రదించండి.

ఓటీపీలు, పిన్ నంబర్లు, ఆధార్, బ్యాంకు వివరాలను ఎవరితోనూ షేర్ చేయొద్దు

బ్యాంక్/టెలికాం పేరుతో వచ్చే నకిలీ కాల్స్‌ను నమ్మకండి

ఆర్థిక లావాదేవీలకు ఎస్ఎంఎస్/ఈ-మెయిల్ అలర్ట్స్‌ను యాక్టివేట్ చేయండి

బలమైన పాస్‌వర్డ్స్ ఉపయోగించి రెండు-దశల ధ్రువీకరణ పెట్టుకోండి.

అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయకండి. మీకు తెలియని యాప్‌లను ఇన్‌స్టాల్ చేయొద్దు.

స్క్రీన్‌షాట్లు, రసీదులు, లావాదేవీ వివరాలను సాక్ష్యాలుగా భద్రపరచండి.

ఇలాంటి మోసాల గురించి 1930 (నేషనల్ సైబర్ క్రైం హెల్ప్‌లైన్)కి కాల్ చేయండి. లేదా http://cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయండి. అలాగే, మీ బ్యాంకుకు సైతం వెంటనే సమాచారం ఇచ్చి ట్రాన్సాక్షన్లను నిలిపివేయాలని చెప్పండి.

# పాతబస్తీలో ఒక రూల్.. ఇతర ప్రాంతాల్లో మరొకటా?:

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: పశ్చిమబెంగాల్‌లో సీఎం మమతా బెనర్జీ పాలన వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. చొరబాటుదార్ల ఓట్లతో గెలవాలని ఆమె కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని బెంగాలీలతో బండి సంజయ్ సమావేశమయ్యారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో భాజపాకు ఓటు వేయాలని కోరారు."బంగ్లాదేశ్ చొరబాటుదారులకు మమత రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. పాతబస్తీలోనూ బెంగాలీ కుటుంబాలు ఉండలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వేలాది మంది హైదరాబాద్ వచ్చారు. రోహింగ్యాలకు రేషన్ కార్డులు, ఓటర్ కార్డులిచ్చి రెడ్ కార్పెట్ పరిచారు. పాతబస్తీలో అక్రమ నిర్మాణాలను కూల్చేందుకు వెళ్లిన జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసులపై మజ్లిస్ ఎమ్మెల్సీ, నాయకులు అడ్డుకొని దౌర్జన్యం చేసినా చర్యలు తీసుకోలేదు. ఆ పార్టీతో సీఎం రేవంత్‌రెడ్డి అంటకాగుతున్నారు. హైడ్రా పేరుతో ఇళ్లు కూలుస్తుంటే.. అడ్డుకున్న భాజపా కార్యకర్తలపై, పేదలపై లాఠీ ఛార్జ్ చేసి కేసులు పెట్టారు. పాతబస్తీలో మాత్రం అక్రమ నిర్మాణాలు కూలుస్తున్న అధికారులపై దాడులు చేస్తున్నా కనీసం

# ఆంక్షలు ఎత్తివేయగానే..

## జిల్లాల హద్దుల్లో మార్పు: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

ఆదిలాబాద్ జిల్లాకు ఆధునిక విద్య, వైద్యం వంటి సదుపాయాలు ఇంకా దక్కలేదు. ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులు తట్టుకొని కాంగ్రెస్ కార్యకర్తలు పోరాడారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను శత్రువులుగా చూసే ప్రభుత్వం కాదు ఇది. గతంలో సీఎం వస్తుంటే.. ప్రతిపక్ష నేతలను అరెస్టులు, గృహనిర్బంధాలు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకపోయినా.. అన్ని నియోజకవర్గాలకు నిధులు ఇస్తున్నాం. అభివృద్ధి పనుల కార్యక్రమానికి విపక్ష ఎమ్మెల్యేలను కూడా పిలిచాం. బీఆర్ఎస్, భాజపా నేతలు మాకు రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే.. శత్రువులు కాదు.

2029 వరకు జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల హద్దులు మార్చవద్దని కేంద్రం చెప్పింది. కేంద్రం ఆంక్షలు ఎత్తివేయగానే.. ప్రజల ఆకాంక్షల మేరకు హద్దులు మారుస్తాం. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటికే రూ.5,400 కోట్లను పేదల ఖాతాల్లో వేశాం. సన్నబియ్యంతో పేదల కడుపు నింపాలనే ఆలోచన గత పాలకులకు వచ్చిందా? రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తున్న రాష్ట్రం.. దేశంలో మరొకటి లేదు. యువత మత్తుబాట వదిలి.. మైదానాల బాట పట్టాలని ప్రయత్నం చేస్తున్నాం. ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి అనే ఆశయంతో ఈ ప్రభుత్వం పని చేస్తోంది" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# ప్రజల సంక్షేమం తప్ప..

## వ్యక్తిగత ప్రయోజనాలు లేవు: భట్టి విక్రమార్క

మొదటి పేజీ తరువాయి

ఆదిలాబాద్: అధికారంలోకి వచ్చేందుకు నేతలు ఎన్నో హామీలు ఇస్తుంటారని, కొందరు అధికారంలోకి రాగానే వాటిని మర్చిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తాము అలాంటివాళ్లం కాదన్నారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్‌కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా పిప్పిరిలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పిప్పిరిలో మొదలుపెట్టి ఖమ్మం వరకు పాదయాత్ర చేసినట్లు గుర్తు చేసుకున్నారు.

" పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీల అమలుపై జీవోలు జారీ చేశాం. ఇవాళే రూ.1,238 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశాం. ఒకే విడతలో రుణమాఫీ చేసి రూ.22,500 కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. ప్రతి నియోజకవర్గంలో పేదల కోసం 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. తొలి ఏడాదిలోనే మొత్తం 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాం. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం. ఇన్ని పథకాలు, హామీలు ఎలా అమలు చేయగలుగుతున్నారని ఇతర రాష్ట్రాల నేతలు అడుగుతున్నారు. ఈ రాష్ట్రంలో పుట్టడం అదృష్టంగా ప్రజలు భావించే పరిస్థితులు ఉండాలని భావించాం. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వర్తించేలా రూ.5 లక్షలతో ఇందిరమ్మ బీమా పథకం తీసుకొచ్చాం. రైతు కుటుంబాల నుంచి వచ్చిన మాకు పేదల కష్టాలు, అవసరాలు తెలుసు. ప్రజల సంక్షేమం తప్ప.. మాకెవరికీ వ్యక్తిగత ప్రయోజనాలు లేవు" అని భట్టి విక్రమార్క అన్నారు.

# పండ్ల మార్కెట్ భూముల మీద రేవంత్‌రెడ్డి కన్ను:

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: హైదరాబాద్ శివారులోని కోహెడ పండ్ల మార్కెట్ భూములపై సీఎం రేవంత్‌రెడ్డి కన్ను పడిందని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. ఎక్కడ భూములున్నా వాటిని అమ్మేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రంగారెడ్డి జిల్లా కోహెడ పండ్ల మార్కెట్ స్థలాన్ని హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వాలు రైతుల కోసమే పని చేయాలని.. దళారుల కోసం కాదన్నారు. గతంలో మార్కెట్‌కు భూసేకరణలో భాగంగా రూ.10 కోట్లు రైతులకు ఇప్పించామని, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ ఫ్రూట్ మార్కెట్ కట్టాలనుకున్నామన్నారు. రూ.వెయ్యి కోట్లతో డీపీఆర్ తయారు చేశామని, 100 ఏళ్లను దృష్టిలో పెట్టుకొని మార్కెట్‌కు రూపకల్పన చేశామని చెప్పారు.

# బంజారాలకు పార్టీలో తగిన ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లోని డీటీ నాయక్ నివాసానికి వెళ్లిన కవిత మర్యాద పూర్వకంగా వారితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తన కొత్త రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వాలని కవిత వారిని కోరారు. పార్టీ ఏర్పాటు నేపథ్యంలో బంజారా సమాజం కోసం ఏం చేయాలనే దానిపై వారితో కూలంకషంగా ఆమె చర్చించారు. ఆ సామాజిక వర్గానికి ఏం చేయాలో అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే బంజారాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడం ఇదే మొదటిసారి అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఏర్పాటు చేయబోయే పార్టీలో వారికి సముచిత అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు బంజారా ప్రముఖులంతా తాము ఏర్పాటు చేయబోయే పార్టీకి సలహాలు, సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించాలనుకునే వారిని తమ పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు.

# బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు ఊపిరితిత్తులు.. గ్రీన్‌ఛానెల్ ఏర్పాటు

మొదటి పేజీ తరువాయి

బెంగళూరు నుంచి ఎయిర్‌లిఫ్ట్ చేసి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించనున్నారు. దీని కోసం హైదరాబాద్ సిటీపోలీసులు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ, సకాలంలో అంబులెన్స్ చేరుకునేలా సహకరించాలని పోలీసులు కోరారు.

# వివాహేతర సంబంధం.. భార్యను హత్య చేసిన భర్త

మొదటి పేజీ తరువాయి

జహీరాబాద్: వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందన్న ఆగ్రహంతో భార్యను భర్త హత్య చేశాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో చోటుచేసుకుంది. తన భార్య ప్రియుడితో కలిసి వెళ్లిపోయిందని.. భర్త జహీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మార్చి 30న పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. ఆమె జడ్చర్లలో ప్రియుడితో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆమెను తీసుకొచ్చేందుకు పోలీసులతో పాటు భర్త వెళ్లాడు. అనంతరం కారులో తీసుకొస్తుండగా.. సదాశివపేట మండలం నందికంది వద్ద భార్యను గొంతు కోసి హత్య చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ముత్యాలమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

**– ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేసిన ములిశెట్టి నాగు**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



కుకునూరు మండలం లోని సీతారామనగరం గ్రామంలో ముత్యాలమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష రూపాయలు నగదును ఇస్తానని తెలుగుదేశం కుక్కునూరు మండల అధ్యక్షులు ములిశెట్టి నాగేశ్వరరావు (నాగు) హామీ ఇచ్చారు. గత సంవత్సరం 50/వేలు రూపాయలు అందజేశారు.మిగతా రూ.50 వేల రూపాయలు నగదును మంగళవారం సీతారామనగరం ముత్యాలమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులకు అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, కుక్కునూరు ఉపసర్పంచ్ పిచ్చుక రాజు,గుర్రం ఉదయ్, తాతా వంశీ,కొమ్ము రాము, సురేష్,నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# టికెట్టు తీసుకోమన్నందుకు కండక్టర్ చెంపపై కొట్టిన మహిళ

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



విజయవాడ నుంచి విసన్నపేట వెళ్లే బస్సు ఎక్కిన ఇద్దరు మహిళల గమనించని కండక్టర్,సింగ్ నగర్ ఫ్లైఓవర్ సమీపంలోకి రాగానే టికెట్టు తీసుకోవాలని కోరాడు.మూడు ఆధార్ కార్డులు చూపించి రెండు టికెట్లు ఇవ్వాలని కోరడంతో వివాదం చెలరేగింది.ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఆవేశంగా ఒక మహిళ కండక్టర్ చెంప పగలకొట్టింది.వెంటనే డ్రైవర్ ఆ బస్సులో ఉన్న ప్రయాణికులతో సహా నున్న పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడు.తనను అసభ్యకరంగా దూషించారని.. అందుకే కొట్టానని మహిళ చెప్పింది.టికెట్టు తీసుకోవాలని మాత్రమే తాను చెప్పానని, దూషించలేదని పోలీసులకు కండక్టర్ చెప్పాడు.ఇంకా పోలీసులు ప్రయాణికులను, ప్రత్యక్షంగా ఉన్న వారినుంచి వివరాలు సేకరించారు.

# బాధిత కుటుంబాలను ఓదార్చిన ఎమ్మెల్యే

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



జీలుగుమిల్లి మండలం తాటి రామన్నగూడెం గ్రామానికి చెందిన మడకం సంతోష్, పండు సందీప్‌లు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మరణించడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బాధితుల నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి దుఃఖంలో తాను భాగస్వామినని తెలిపారు. ఇలాంటి దుర్ఘటనలు అత్యంత బాధాకరమని పేర్కొంటూ, బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని, ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి రాము, సొసైటీ అధ్యక్షులు సరిపల్లి సత్యనారాయణ రాజు, కూటమి నాయకులు గుడెల్లి లక్ష్మీనారాయణ, బండారు అనిల్ కుమార్, కుంజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి బిల్లు ఆమోదం... సుధీర్ రెడ్డి నేతృత్వంలో బైక్ ర్యాలీ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7, గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్



ఆంధ్రప్రదేశ్‌కు అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.శ్రీకాళహస్తి ఏపీ సీడ్స్ నుండి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ నాలుగు మాడవీధుల గుండా సాగి పట్టణమంతా ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించింది. వేలాది మంది కూటమి కార్యకర్తలు, నాయకులు పాల్గొనడంతో పట్టణం జనసందోహంతో నిండిపోయింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, గత వైసిపి మాజీ ముఖ్యమంత్రి జగన్ అమరావతిపై చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. “అమరావతి ఎందుకు పనికిరాదు” అంటూ దానిని “భ్రమరావతి”గా విమర్శిస్తూ అభివృద్ధిని అడ్డుకున్నారని ఆరోపించారు. మూడు రాజధానులు అంటూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని నాశనం చేశాడు.అలాగే శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కూడా “అమరావతి ఏమన్నా కూడు పెడుతుందా” అంటూ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషితో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో పాటు కూటమి ఎంపీల సమిష్టి ప్రయత్నాల ఫలితంగా అమరావతి మళ్లీ అభివృద్ధి పథంలోకి వచ్చిందని తెలిపారు. అమరావతిని ప్రపంచ స్థాయి స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.అలాగే మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి అమరావతి రైతుల త్యాగాలకు న్యాయం చేశారని పేర్కొన్నారు. ఇకపై అమరావతి ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగా నిలుస్తుందని తెలిపారు.ఈ విజయోత్సవ ర్యాలీలో కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మా పాఠశాల స్థలాన్ని కాపాడండి సార్....విద్యార్థులు

**– చెల్లూరు పాఠశాల స్థలంపై కబ్జా ఆరోపణలు**
**– సేవ్ మై స్కూల్... సేవ్ మై గ్రౌండ్ నినాదాలతో విద్యార్థుల నిరసన....**
**– అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలంటూ డిమాండ్.....**





ఏర్పేడు, ఏప్రిల్ 07, గాయత్రి వార్తలు:రిపోర్టర్ : మునిరత్నం

ఎర్పేడు మండలం చెల్లూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల స్థలం కబ్జా జరుగుతోందని గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు శతాబ్ద కాల చరిత్ర గల పాఠశాల మైదానాన్ని కొందరు వ్యక్తులు అక్రమ రిజిస్ట్రేషన్ ద్వారా తమదిగా ప్రకటిస్తూ గ్రామస్తులను బెదిరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో గ్రామంలోని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు కలిసి సేవ్ మై స్కూల్... సేవ్ మై గ్రౌండ్ అంటూ నినాదాలతో నిరసన తెలియజేశారు. అధికారులను వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సర్వే నంబర్ 23/1లో సుమారు 66 సెంట్ల విస్తీర్ణం గల ఈ భూమి బ్రిటీష్ కాలం నుంచే పాఠశాల స్థలంగా ఉపయోగంలో ఉందని తెలిపారు. 1966 నుంచి ఇదే సర్వే నంబర్‌లో ఇదే విస్తీర్ణం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందినదిగా రికార్డుల్లో నమోదై ఉందని వెల్లడించారు. పంచాయతీరాజ్ చట్టం రాకముందు క్రిస్టియన్ మిషనరీలు ఈ పాఠశాలను నిర్వహించారని, అనంతరం ప్రభుత్వం ఆధీనంలో కొనసాగుతోందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఇటీవల 2025 జూలై నెలలో కొందరు వ్యక్తులు రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ భూమిపై అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పాత పత్రాలను ఆధారంగా చూపిస్తూ ఈ భూమిని తమదిగా ప్రకటించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇది పూర్తిగా ప్రభుత్వ పాఠశాల భూమి అని, ఆన్‌లైన్ రికార్డుల్లో కూడా అదే స్పష్టంగా ఉందన్నారు. అయినా కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని భూమిపై హక్కులు చూపుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల మైదానానికి కంపౌండ్ వాల్ లేకపోవడంతో పందులు, ఆవులు స్వేచ్ఛగా సంచరిస్తూ విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగిస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు.పిల్లలు ఆడుకునే స్థలం లేకపోవడం, మొక్కలు నాటే అవకాశం లేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. మేము మొక్కలు నాటితే కూడా వారు వచ్చి తొలగిస్తున్నారని, గొడవలు వద్దనే సహనంగా ఉన్నాం అన్నారు. కానీ ఇప్పుడు పాఠశాల స్థలమే పోతుందేమోనని భయపడుతున్నాం అని గ్రామస్తులు వాపోయారు. ఈ విషయాన్ని వెంటనే పరిశీలించి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యక్షంగా పరిశీలిస్తే ఇది పాఠశాల భూమేనని తేలిపోతుందని వారు తెలిపారు. ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకుని అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి భూమిని పాఠశాలకు అప్పగించాలని కోరుతూ ప్రజాప్రతినిధులకు కూడా విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకోవాలని అభ్యర్థించారు. పాఠశాల భూమి రక్షణ కోసం గ్రామస్తులు ఐక్యంగా ముందుకు వచ్చారు.అధికారులు స్పందించకపోతే మరింత తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. శతాబ్ద కాల చరిత్ర కలిగిన పాఠశాల భూమిపై కబ్జా ఆరోపణలు వెలుగులోకి రావడం కలకలం రేపుతుండగా అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది.

# అనాధ బాలలను అక్కున చేర్చుకున్న జిల్లా కలెక్టర్

**– నూతన జీవితాన్ని అందించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



కన్నతల్లి చనిపోయి అనాథలైన ముగ్గురు పిల్లలను గాలికి వదిలేసి ఎటో వెళ్లిపోయిన తండ్రి, ఈ కారణంగా అనాథలైన ముగ్గురు చిన్నారులను అక్కున చేర్చుకుని వారికి నూతన జీవితాన్ని జిల్లా కలెక్టర్ కె. వెట్రీ సెల్వీ అందించారు. ఏలూరు జిల్లా కుక్కునూరు చెందిన ముగ్గురు చిన్నారులు 7సంవత్సరాలు, 6 సంవత్సరాలు, నాలుగు సంవత్సరాలు వయసు కలిగిన బాలికల తల్లి ఇటీవల మరణించింది. తండ్రి పిల్లలను వదిలేసి ఏటో వెళ్లిపోయారు. తల్లిదండ్రులు లేక బాల్యాన్ని భారంగా దీనస్థితిలో ఉన్న వారి పరిస్థితిని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సదరు పిల్లల పరిస్థితిని పరిశీలించి తీసుకురావలసిందిగా ఐసిడిఎస్ పీడీ శారద,జిల్లా బాలల సంరక్షణ అధికారి సిహెచ్ సూర్య చక్రవేణిని ఆదేశించారు. కలెక్టరేట్ లో సదరు బాలికలతో కలెక్టర్ కొంతసేపు మాట్లాడి వారి వివరాలు, పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి కొత్త బట్టలు, చెప్పులు, బిస్కెట్లు, డ్రాయింగ్ పుస్తకాలు, కలర్ పెన్సిల్ లు నోట్ బుక్స్ ఇచ్చి, తదుపరి చర్యల తీసుకోవలసిందిగా జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సూర్య చక్రవేణికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆదరణ కరువై, సంరక్షణ అవసరమైన పిల్లలకు సంరక్షించేందుకు బాలల సంక్షేమ సమితి ఏలూరు సిబ్బంది దెందులూరు బాలసదనం నందు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు సదరు బాలికలను జాయిన్ చేసి, వారికి భోజన, వసతి సదుపాయాలతో పాటు విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా బాలికలు కలెక్టర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఐసిడిఎస్ పీడీ పి శారద, జిల్లా బాలల సంరక్షణ అధికారి సిహెచ్ సూర్యచక్రవేణి, డిసిపియు సిబ్బంది రాజకుమార్, రాజు, రాజేష్, కుక్కునూరు సిడిపిఓ అనంత లక్ష్మీ, సూపర్వైజర్ రుక్మిణి, పిల్లలు కి మేనత్త వరుస అయిన కుమారి తదితరులు పాల్గొన్నారు.

# 4108 పాసుపుస్తకాలు పంపిణీ

**– జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రకటన**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

ఏలూరు జిలాల్లో ఏప్రిల్ నెలలో ఇంతవరకు 4108 పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేశామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రాష్ట్ర భూ పరిపాలనా శాఖ ముఖ్య కమిషనర్ జి. జయలక్ష్మికి చెప్పారు. రాష్ట్రంలో రెవిన్యూ క్లినిక్ లు నిర్వహణ, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, మ్యుటేషన్స్, రీ సర్వే , 22ఏ భూ సమస్యల పరిష్కారం, పిజిఆర్ ఎస్ అర్జీల పరిష్కారం, తదితర అంశాలపై రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, డిఆర్ఓ లు, ఆర్డీఓ లతో రాష్ట్ర భూ పరిపాలనా శాఖ ముఖ్య కమిషనర్ మంగళవారం రాష్ట్ర సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్య కమిషనర్ జి. జయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ కి ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో గ్రామాలను ఎంపిక చేసుకుని భూమి వివరాలు సవరణ వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రీ సర్వే అనంతరం సవరించిన భూమీ వివరాలు ఆన్లైన్ లో నమోదు చేసి ఎటువంటి తప్పులు లేకుండా క్యూ ఆర్ కోడ్, రాజముద్రతో ముద్రించిన పట్టాదార్ పాస్ పుస్తకాలను ముద్రించి రైతులకు పంపిణీ చేస్తున్నామని, ఏప్రిల్ నెలలో 4343 పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీకి గాను, 4108 పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేశామని, మిగిలినవి నిర్దేశించిన సమయంలో పంపిణీ చేస్తామన్నారు. రెవిన్యూ సమస్యలపై ప్రతీ సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమంతో పాటు రెవిన్యూ క్లినిక్ లు నిర్వహిస్తున్నామన్నారు. ఏలూరు జిల్లాలో పిజిఆర్ ఎస్ ద్వారా అందిన అర్జీలు రీఓపెన్ కాకుండా నాణ్యమైన



రీతిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, ఇంచార్జ్ డిఆర్ఓ భాస్కర్, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీఓలు ఐ. కిషోర్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో “పాదయాత్ర”

**– విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన వ్య.కా.స. మండల కార్యదర్శి కూరాకుల బాబురావు.**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును జీరాంజీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంగా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరుగనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కూరాకుల బాబురావు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో మంగళవారం పాదయాత్రకు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు.ఈనెల 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు అనంతపురం జిల్లా అనంతపురం నుండి బండ్లపల్లి వరకు పాదయాత్ర జరుగుతుందని బాబురావు తెలిపారు. అంతేకాకుండా ఉపాధి హామీ కూలీలకు మస్టర్ వేసే పద్ధతిని కాదని దాని స్థానంలో ఫోటో తీసే పద్ధతిని ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్లుగా నిర్విరామంగా కొనసాగుతున్న ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తుందని విమర్శించారు. ఎన్నడూ లేని విధంగా ఫోటో తీసే




లేనిపోని పద్ధతిని ప్రవేశపెట్టి కూలీల పొట్ట కొట్టాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో వ్య.కా.స.నాయకులు పూనెం వెంకటేశ్వర్లు,లాడే ప్రేమ్ కుమార్,సారంగి రాజేశ్, బల్లెం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# జలధార పనుల గుర్తింపు – అంచనాల ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి

**– దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**
**– దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో సాగు నీటి సంఘాల చైర్మన్లు,సభ్యులు, ప్రత్యేక అధికారులు, ఇరిగేషన్ సహా వివిధ శాఖల అధికారులతో సమీక్ష.**
**– అంచనాలు త్వరగా సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం**
**– రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడడమే లక్ష్యమన్న ఎమ్మెల్యే**



గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జలధార' – నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమంలో భాగంగా దెందులూరు నియోజకవర్గంలో చేపట్టాల్సిన పనులపై ఎమ్మెల్యేచింతమనేని ప్రభాకర్ మంగళవారం దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో కలిసి కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నీటి సంఘాల చైర్మన్లు, సభ్యులు మరియు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**అంచనాలు వేగవంతం చేయాలని ఆదేశం**
నియోజకవర్గ పరిధిలోని చెరువులు కాలువలు, డ్రైన్ల పూడికతీత మరియు మరమ్మత్తు పనులకు సంబంధించి అంచనాలను యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నీటి సంఘాల చైర్మన్లు, సభ్యులతో సమన్వయం చేసుకుని, ఎక్కడెక్కడ అత్యవసరంగా పనులు చేపట్టాలో గుర్తించి నివేదికలు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ.. "జలధార కార్యక్రమం ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే పూడికతీత పనులు పూర్తి చేయడం వల్ల శివారు భూములకు కూడా సాగునీరు సజావుగా అందుతుందని పేర్కొన్నారు. దెందులూరు నియోజకవర్గంలో బ్రిటిష్ కాలం నుంచి ఉన్న అనేక చెరువులతో పాటు ఇతర చెరువులను కాలువలను పూడికతీతతో పాటు మరమ్మత్తులు చేపట్టడం ద్వారా ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు దోహదపడుతుందని, అదేవిధంగా ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.. పనుల నాణ్యతలో రాజీ పడకూడదని, నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలని స్పష్టం చేశారు. పనుల మంజూరులో కానీ, అంచనాల తయారీలో కానీ అధికారులు ఉదాసీనత వహించకూడదని ఎమ్మెల్యే హెచ్చరించారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా నీటి సంఘాల ప్రతినిధులు చురుగ్గా పాల్గొని పనులను పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో దెందులూరు మండల తహశీల్దార్ బత్తిన సుమతి, దెందులూరు సొసైటీ చైర్మన్ గారపాటి కొండయ్య చౌదరి, తెలుగు యువత అధ్యక్షులు మోతుకూరి నాని, ఎంపీడీవో ప్రతాప్, కూటమి నాయకులు తిలక్ సహా వివిధ నీటి సంఘాల చైర్మన్లు సభ్యులు వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# రేషన్ పంపిణీ లో నిర్లక్ష్యపు డీలర్లను తొలగిస్తాం

**– జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ హెచ్చరిక**



గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

రేషన్ పంపిణీ విషయంలో నిర్లక్ష్యం వహించే డీలర్లను తొలగిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ హెచ్చరించారు. ఇటీవల ఐవీఆర్ ఎస్ ఫీడ్‌బ్యాక్ రేషన్ పంపిణీ తదితర విషయాలలో తక్కువ పనితీరు కనబరిచిన 45 మంది చౌకధరల దుకాణాల డీలర్లతో మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో డీలర్ల పనితీరును జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రజల సంతృప్తి స్థాయికి ఐవిఆర్ ఎస్ విధానం ద్వారా ప్రభుత్వం తెలుసుకుంటున్నదన్నారు. ప్రజలకు రేషన్ పంపిణీ ని సక్రమంగా చేయాలనీ, రేషన్ కోసం వచ్చే వారితో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. రేషన్ దుకాణాల ద్వారా డీలర్ల సేవలపై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలను తెలియజేస్తారన్నారు. జిలాల్లోని 45 రేషన్ డీలర్లు సేవలలో ఐవీఆర్ ఎస్ ఫీడ్‌బ్యాక్‌లో వెనుకబడి ఉన్నారని, సదరు డీలర్లు వారి పనితీరు మెరుగుపరచుకోవాలన్నారు. నాణ్యమైన నిల్వ, పరిశుభ్రత, సరుకులు పాడవకుండా నాణ్యమైన నిల్వ సౌకర్యాలతో, మంచి గోడౌన్లను ఏర్పాటు చేసుకోవాలని, రేషన్ షాపు పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రేషన్ పంపిణీ సమయంలో లబ్ధిదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రవర్తనా లోపాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఇవ్వకూడదన్నారు. రేషన్ పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేసి, ఐవీఆర్ ఎస్ ఫీడ్‌బ్యాక్‌లో మెరుగుదల సాధించేందుకు జాయింట్ కలెక్టర్ డీలర్లకు పలు కఠిన సూచనలు జారీ చేశారు. తక్కువ పనితీరు కనబరిచిన 45 రేషన్ దుకాణాలను సీఎస్‌డీటీలు వెంటనే వ్యక్తిగతంగా సందర్శించి, పైన తెలిపిన ఆదేశాలన్నీ సక్రమంగా అమలవుతున్నాయో లేదో క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఏలూరు జిల్లా పౌర సరఫరాల అధికారి బాబు విలియమ్స్, , పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరామమూర్తి,ఏలూరు సహాయ పౌర సరఫరాల అధికారి జిల్లాలోని సీఎస్‌డీటీలు పాల్గొన్నారు.

# ప్రతీ జిల్లాకు నోడల్ అధికారిని నియమించాలి

**– సుప్రీం కోర్టు ఆదేశాలు**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన భవనాలను తొలగించు సందర్భంలో అర్బన్ డెవలప్మెంట్ అథార్టీలో పని చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు, నగరపంచాయితీలలో పనిచేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు, గ్రామ పంచాయితీ కార్యదర్శులు ,నగరపాలక సంస్థ లలో పనిచేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ కమీషనర్ లు సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధంగా చేస్తున్నారు. అక్రమ భవన నిర్మాణాలకు సంబంధించిన ప్రతీ విషయం అన్ లైన్ పబ్లిక్ డొమైన్ లో అప్లోడ్ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిన చేయటం లేదు. అలాగే అక్రమ నిర్మాణాలు తొలగించాలా లేదా అనేది



ఫైనల్ నిర్ణయం తీసుకోవడానికి ప్రతీ జిల్లాకు ఓ నోడల్ అధికారిని నియమించాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ ఒక్క జిల్లాలో నోడల్ అధికారిని నియమించలేదు. అక్రమ భవన నిర్మాణాలు తొలగింపు విషయం లో సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వానికి అర్జీని పంపించి నేటికి 60 రోజులకు పైగా గడిచిన ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ విషయం పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు లో ప్రజాప్రయోజన వ్యాజ్యం ఈ నెలలో సమాచారహక్కు పరిరక్షణ సమైక్య వేదిక సంఘం దాఖలు చేయునున్నది. అక్రమ భవన నిర్మాణాలు తొలగింపు విషయం పై సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు అనుసరించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ప్రతీ భవన నిర్మాణం గురించి పబ్లిక్ డొమైన్ లో అప్లోడ్ చేయటం,ప్రతీ జిల్లాకు ఓ నోడల్ అధికారిని నియమిస్తే అక్రమ భవన నిర్మాణాలు చేపట్టిన భవన యజమానులు నుండి రాజకీయ నాయకులు,టౌన్ ప్లానింగ్ అధికారులు, గ్రామ పంచాయితీ కార్యదర్శు లు చీకటి ఒప్పందాలు కుదుర్చుకొని వసూలు చేస్తున్న బ్లాక్ మనీ ఇక భవిష్యత్తు కాలంలో వసూలు చేయటానికి కుదరదు. దీని వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అక్రమ భవనాల నిర్మాణాలు తొలగింపు విషయం లో జరుగుతున్న వేల కోట్ల కుంభకోణానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో అడ్డుపడినట్లేనని సమాచారహక్కు పరిరక్షణ సమైక్య వేదిక భావిస్తోంది.

# శ్రీకాళహస్తి ఆలయాన్ని సందర్శించిన రైల్వే ఉన్నతాధికారి



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7, గాయత్రి వార్తలు : రిపోర్టర్ : రంజిత్
శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానాన్ని సౌత్ సెంట్రల్ రైల్వేస్ గుంతకల్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీ చంద్రశేఖర్ గుప్తా కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ ఆయనకు సాదర స్వాగతం పలికి, అంతరాలయ దర్శనం, వేద ఆశీర్వచనం ఏర్పాటు చేశారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం ఆలయ మొదటి గోపురం సమీపంలో రైల్వే టికెట్ కౌంటర్, రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు గుర్రప్ప శెట్టి తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ జిల్లా స్థాయి బూత్ కమిటీ సమావేశం విజయవంతం



గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్
ఏలూరు జిల్లాలో నిర్వహించిన వైసీపీ జిల్లా కన్వీనర్ దూరం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బూత్ కమిటీ సమావేశంలో కుకునూర్ మండలం నుండి రాయి సత్యనారాయణ -- మండల ఉపాధ్యక్షులు, ఆవుల బాలకృష్ణా రెడ్డి -- మండల బూత్ కన్వీనర్, బొల్లి శ్రీను -- మారేడుబాక పంచాయతీ బీసీ సెల్ అధ్యక్షులు గంధం సుమంత్ -- వింజరం పంచాయతీ బూత్ కన్వీనర్ పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్టేట్ బూత్ కమిటీ ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ..బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం,కార్యకర్తల సమన్వయం, ఎన్నికల దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలు వంటి కీలక అంశాలపై విశ్లేషణాత్మకంగా చర్చ జరిగింది. ముఖ్యంగా గ్రామ స్థాయి నుండి పార్టీని మరింత బలపరచడం, ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించడం, ప్రతి బూత్‌ను విజయం వైపు తీసుకెళ్లే విధంగా ప్రణాళికలు రూపొందించడం జరిగింది.

# ఏబీఎన్ ఆంధ్రజ్యోతి పై దాడి యత్నం ఖండన

**– ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి హెచ్చరిక**

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7, గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్



హైదరాబాద్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీకి చెందిన వ్యక్తులు దాడి చేయడానికి ప్రయత్నించిన ఘటనను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. మంగళవారం పట్టణంలోని పంచాయతీరాజ్ భవనంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఈ విషయంపై స్పందించారు. పత్రికా స్వేచ్ఛను అణచివేయాలనే ప్రయత్నాలను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. మీడియాపై దాడులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. పత్రికా సంస్థలను బెదిరించడం సరైన విధానం కాదని, ఇలాంటి చర్యలు తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇస్తే రాష్ట్రంలో సాక్షి కార్యాలయాలను నిలువనివ్వకుండా చేసే స్థాయి తమకు ఉన్నప్పటికీ, తమ నాయకత్వం అలాంటి చర్యలను ప్రోత్సహించదని పేర్కొన్నారు. అయితే మీడియా సంస్థలను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడితే తీవ్రంగా ప్రతిస్పందించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, బిజెపి నాయకుడు అమర్నాథ్ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళల రక్షణకు ముందుకొచ్చిన ఫ్యాన్స్ అసోసియేషన్



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7, గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్
సినీ నటుడు అల్లు అర్జున్ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల్లో గర్భసంచి సంబంధిత వ్యాధులు, ముఖ్యంగా సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అవసరాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా 14 సంవత్సరాలు నిండిన బాలికలు తప్పనిసరిగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచిస్తూ రూపొందించిన అవగాహన పోస్టర్‌ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుదీర్ రెడ్డి చేతుల మీదుగా ఊరందూరు లోని ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు. అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, మహిళల్లో ఆరోగ్య చైతన్యం పెంచేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాలను ముందుండి నిర్వహిస్తామని వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో అల్లు షఫీ, పవన్ మారి, అస్మదుల్లా, చాణిక్య, తిరు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని అభినందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఇలాంటి సామాజిక కార్యక్రమాలను భవిష్యత్తులో మరింతగా కొనసాగించాలని సూచించారు.

***GAYATHRI VARTHALU Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,*** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.